సాక్షి
బాపట్ల

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



ఐజీని కలిసిన ఎస్పీ ఆరిఫ్

నగరంపాలెం: రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరించిన జి.పాలరాజును సోమవారం జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

కరోనా జీరో

గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.





రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
బాపట్ల	6:28	4:32
గుంటూరు	6:28	4:32
నరసరావుపేట	6:30	4:29

ఉన్నతితో ఉపాధి

- ఉపాధిహామీ కూలీలకు కుటీర పరిశ్రమలు
- 100 రోజులు పనిదినాలు పూర్తిచేసుకున్న యువత గుర్తింపు
- 40 రకాల ఉపాధి అవకాశాలపై శిక్షణ
- ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఏర్పాటు
- యువత ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఉపాధిహామీ కూలీల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణకు ఉపక్రమించింది. ఇప్పటివరకు 2.95 లక్షల మంది కూలీలకు జిల్లాలో ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం పనులు కల్పిస్తుంది. కేవలం 100 రోజుల పనిదినాలు కల్పించడం వలన కూలీల ఆర్థిక పరిస్థితి పెద్దగా మెరుగుపడే పరిస్థితి లేదు. ఈ లెక్కన కేవలం మూడున్నర నెలల కాలం పాటు మాత్రమే పేద కూలీలకు భృతి దొరికే అవకాశం ఉంది. ఇది వారి జీవన ప్రమాణాన్ని పెద్దగా మెరుగుపర్చదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉన్నతి పథకం ద్వారా వారిని ఆదుకునేందుకు సిద్ధమైంది.

అర్హుల గుర్తింపు ఇలా..

గడిచిన మూడు సంవత్సరాల కాలంలో 100 రోజులు పనిదినాలు పూర్తిచేసుకున్న ఉపాధికూలీల యువతను తొలుత గుర్తిస్తారు. అనంతరం 50 మందిని గ్రూపుగా సిద్ధం చేస్తారు. ఇందులో ఆసక్తి కలిగిన మహిళలు ఉంటారు. ఎంపిక చేసిన వారి ఆసక్తి గుర్తించి కుట్టుమిషన్లు, సెల్‌ఫోన్ రిపేర్లు, చేపలు, రొయ్యల ప్రాసెసింగ్, ప్యాకింగ్, సైకిల్, బైక్ రిపేర్లు, పచ్చళ్ల తయారీ, ఆటోలో తదితర 40 రకాల చిన్న తరహా పరిశ్రమల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణా కాలంలో భోజనం, వసతిని ప్రభుత్వమే సమకూరుస్తుంది. డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేస్తారు.

కుటీర పరిశ్రమలతో ప్రోత్సాహం..

ఎంపిక చేసిన యువతకు ఉన్నతి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తారు. దీంతోపాటు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ద్వారా, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు ఇప్పించి కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేస్తారు. పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఆర్థికసాయం అందిస్తుంది. అన్ని ప్రభుత్వ పథకాల పరిధిలో ఎంపిక చేసిన వారికి స్వయం ఉపాధి కింద రుణాలు ఇప్పించి పరిశ్రమలు పెట్టిస్తారు.

ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు..

కేవలం ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజుల పనిమాత్రమే కల్పిస్తారు. ఈ లెక్కన కూలీకి కేవలం రూ. 27,200 మాత్రమే వస్తుంది. ఇది సంవత్సరం పొడవున సదరు కూలి జీవనానికి సరిపోదు. 100 రోజుల పని కల్పించి చేతులు దులుపుకోకుండా ఏడాది పొడవున అర్హులైన పేద యువతకు పనులు కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పం. దీని వలన పేదల ఆర్థిక ఎదుగుదల సాధ్యమవుతుంది. ఆ కుటుంబాల ఇబ్బందులు తొలగుతాయి. ఇందుకోసమే ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఈ సరికొత్త కార్యక్రమాన్ని విస్తృతం చేస్తోంది. ఆసక్తి ఉన్న యువతను డ్వామా విభాగం గుర్తిస్తుంది. ఆ తర్వాత డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ ఇస్తారు. ప్రభుత్వం కుటీర పరిశ్రమలకు ఆర్థికసాయం చేస్తోంది. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 2.95 లక్షల మందికి ప్రభుత్వం ఉపాధిహామీ పనులు కల్పించింది. ఇందులో 7787 కుటుంబాలు 100 రోజుల పనిదినాలను పూర్తిచేసుకున్నాయి. వీరి నుంచి ఆసక్తి ఉన్న యువతను ఎంపిక చేయనున్నారు.

యువతతో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం..



ఉపాధికూలీల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉన్నతి పథకం ద్వారా సిద్ధమైంది. తొలుత గడిచిన 3 సంవత్సరాల్లో 100 రోజులు పనిదినాలు పూర్తిచేసిన యువతను గుర్తిస్తారు. వారిలో ఆసక్తిని బట్టి వివిధ రకాల కుటీర పరిశ్రమలపై శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత ప్రభుత్వం ఆర్థికసాయం అందించి పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తారు. దీని ద్వారా పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. – శంకర్ నాయక్, డ్వామా పీడీ

సమస్యలపై సత్వర స్పందన అవశ్యం

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



కలెక్టర్ రంజిత్‌బాషాకు అర్జీలు అందజేస్తున్న మహిళలు

బాపట్ల అర్బన్: జిల్లాలో ప్రజల నుంచి స్పందనకు వచ్చే అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టర్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో పేద ప్రజలు సమస్యలపై పదే పదే తిరగకుండా స్పందన అర్జీలను పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్జీలను ప్రభుత్వం విధించిన గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో సోమవారం తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలో జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో వచ్చే అర్జీలను అధికారులు ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలను ముఖ్య ప్రణాళిక అధికారి పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లాలో త్వరలో గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. ఆ కార్యక్రమంలో గ్రామ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు వివరాలు తయారు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, సీపీఓ భరత్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌నాయక్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ సురేష్, పౌర సరఫరాల శాఖ డీఎస్‌ఓ విలీమ్స్, డీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9902 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

బావుడా వైస్ చైర్మన్ భానుప్రతాప్



బాపట్ల: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బావుడా) పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసే విధంగా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావుతో కలిసి కృషి చేస్తామని బావుడా వైస్ చైర్మన్ భానుప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఏర్పాటు అనంతరం ప్రభుత్వం బాపట్ల, రేపల్లె, వేమూరు పరిధిలోని మండలాలతోపాటు కాకుమాను, పెదనందిపాడు మండలాలను కలిపి బావుడాగా ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే వైస్ చైర్మన్ తో పాటు ప్లానింగ్ అధికారులు కూడా బాధ్యతలు స్వీకరించారని, మరో వారంలో చైర్మన్ కూడా బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బావుడా కార్యాలయ పనులు జరుగుతున్నాయని పనులు పూర్తయిన అనంతరం కార్యాలయ ప్రారంభం జరుగుతుందని వివరించారు. బావుడా ఏర్పడిన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి బాపట్ల, రేపల్లె నియోజకవర్గ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కోసం 9902 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఇప్పటికే ఆరుగురు ప్లానింగ్ కార్యదర్శులను డిప్యూటేషన్‌పై నియమించామని మండలాల వారీగా విధి నిర్వహణ అప్పగిస్తామని చెప్పారు. పంచాయతీలలో 300 మీటర్ల పైబడి నిర్మించే గృహాల యజమానులు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో అనుమతులు తీసుకోవాల్సిందిగా చెప్పారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వారి ద్వారా గ్రామపంచాయతీ కార్యదర్శులకు తెలియజేశామన్నారు. పట్టణ ప్రణాళిక అధికారి శ్రీలక్ష్మి, ప్లానింగ్ కార్యదర్శులు నరేష్, భార్గవ్, దివ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కోవిడ్ బాధితులకు నగదు అందజేత



గుంటూరు వెస్ట్: కోవిడ్ సెకెండ్ వేవ్ సందర్భంగా కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు రోగులను దారుణంగా దోచుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో అప్పులు చేసి మరీ ఆసుపత్రుల బిల్లులు చెల్లించిన కొందరికి ఉపశమనం లభించింది. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు వైద్య శాఖ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లు సంయుక్తంగా విచారించి మూడు ఆసుపత్రుల్లో అధికంగా బాధితుల నుంచి నగదు తీసుకున్నట్లు గుర్తించాయి. అంతేకాకుండా వారి వద్ద నుంచి అధికంగా వసూలు చేసిన సొమ్ములో కొంతమొత్తాన్ని బాధితులకు ఇప్పించాయి. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో 10 మంది బాధితులకు రూ.7,44,447 మొత్తాన్ని కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మానవ జీవితమంటే అవకాశమున్నంత వరకు సాటి మనిషికి సాయపడడమేన్నారు. కొన్ని ఆసుపత్రుల్లో బాధితుల నుంచి దారుణంగా దోచుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిని ఉపేక్షించబోమని చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్ బాబు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కన్వీనర్ జయరామకృష్ణ పాల్గొన్నారు.

20 నుంచి అమర్‌నాథ్ యాత్రికులకు వైద్య పరీక్షలు

గుంటూరుమెడికల్: అమర్‌నాథ్ యాత్రికులకు ఈనెల 20 నుంచి గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య పరీక్షలు వారంలో ప్రతి మంగళవారం, గురువారం మాత్రమే చేస్తారన్నారు. యాత్ర కు వెళ్లే ప్రతి ఒక్కరూ తమతోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రెండు మెడికల్ సర్టిఫికెట్ నమూనాలు, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకుని ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల మధ్యలో రావాలని ఆసుపత్రికి రావాలన్నారు. ఇతర వివరాల కోసం 9985404974 ఫోన్ లో సమాచారం పొందవచ్చు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.60 అడుగుల వద్ద ఉంది. ఇది 159.6858 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,292, ఎడమకాలువకు 5,018, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 12,110 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 12,110 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.70 అడుగుల వద్ద ఉంది. ఇది 31.3963 టీఎంసీలకు సమానం.

యార్డుకు 1,50,569 బస్తాలు రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,50,569 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ-నామ్ ద్వారా 1,40,783 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 98,276 బస్తాలు నిల్వ ఉన్నాయి. ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. దీంతో రైతులు విక్రయాలకు మొగ్గు చూపుతున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించినట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరికి యావజ్జీవం

- ఒక్కొక్కరికీ రూ.1500 జరిమానా
- బాధితురాలికి నష్టపరిహారంగా రూ.7 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశం

గుంటూరు లీగల్: బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి, అతనికి సహకరించిన నిందితురాలికి పోక్సో కోర్టు న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికీ రూ.1500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం వివరాల మేరకు.. బాధితురాలికి (16) తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి శారదా కాలనీలో నివాసం ఉంటున్న తాతయ్య దగ్గర ఉంటోంది. తాతయ్యతో కలిసి ఆమె మిరప కోతకు కూలి పనులకు వెళ్తూ ఉండేది. శారదకాలనీకి చెందిన కడియం కోటేశ్వరి బాధితురాలి తాతయ్య దగ్గరకు వచ్చి తాను లారీలోని మామిడి కాయలను షాపులకు దించే కూలీలకు మేస్త్రీగా వ్యవహరిస్తున్నానని చెప్పింది. అంతేకాకుండా బాధితురాలిని తన వద్దకు కూలి పనులకు పంపమని కోరింది. దీనికి బాధితురాలి తాతయ్య అంగీకరించాడు. లాలాపేటలోని మేదర బజార్‌లో మామిడి కాయలు దించే కూలి పనులకు కోటేశ్వరితో కలిసి బాధితురాలు వెళ్తుంది. ఈ క్రమంలో కోటేశ్వరితో బాగా పరిచయం ఉన్న మామిడి కాయల వ్యాపారి బత్తుల అర్జున్‌రావు అలియాస్ అర్జున్ బాధితురాలిపై కన్నేశాడు. బాధితురాలిని తన వద్దకు పంపితే రూ.500 ఇస్తానని కోటేశ్వరికి చెప్పాడు. దీంతో కోటేశ్వరి బాధితురాలిని ఒత్తిడి చేయడం ప్రారంభించింది. అర్జున్‌తో గడపాలని బెదిరించింది. దీనికి బాధితురాలు తిరస్కరించింది. దీంతో ఓ రోజు అర్జున్ బాధితురాలిని అకస్మాత్తుగా గట్టిగా పట్టుకుని మామిడి కాయలు నిల్వ చేసే పెద్దాయన షాప్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. దీనికి కోటేశ్వరి కూడా సహకరించింది. వారి బెదిరింపులకు భయపడిన బాధితురాలు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. 2017 మే 15న బాధితురాలికి జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపీకి చూపించగా ఆమె గర్భవతిని తేలింది. దీంతో బాధితురాలు జరిగిన విషయాన్ని తమ బంధువులకు చెప్పగా వారు లాలాపేట పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి డీఎస్పీ బి.సీతారామయ్య దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితులు బత్తుల అర్జున్‌రావు, కడియం కోటేశ్వరిపై సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు పైవిధంగా తీర్పు చెప్పారు. బాధితురాలికి నష్టపరిహారంగా రూ.7 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ శ్యామల కేసు వాదించారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన డిగ్రీ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం వీసీ ఆచార్య పి రాజశేఖర్ విడుదల చేశారు. ఫలితాలను www.anu.ac.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు.

పరీక్షలకు మొత్తం 25, 387 మంది విద్యార్థులు హాజరుకాగా 13, 794 మంది ఉత్తీర్ణులయ్యారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి మే 2 ఆఖరు తేదీగా నిర్ణయించారు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో స్క్రిప్టుకు రూ.1130 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఏపీలాసెట్ కన్వీనర్ ఆచార్య బి.సత్యన్నారాయణ, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సంధ్యాకోల్, ఏసీఈ ఆర్ ప్రకాశరావు, రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'స్పాట్'!

- గుంటూరు జిల్లాకు 2.12 లక్షల జవాబు పత్రాలు
- విధులకు 1,059 మంది ఉపాధ్యాయుల నియామకం
- ఎవ్వరికీ మినహాయింపు లేదు
- జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ విధి నిర్వహణలో ఏ ఒక్కరికీ మినహాయింపులు లేవని గుంటూరు డీఈఓ పి.శైలజ స్పష్టం చేశారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేందుకు ఈనెల 19 నుంచి నిర్వహిస్తున్న స్పాట్ వాల్యుయేషన్ విధులకు 1,059 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు చెప్పారు. మూల్యాంకన విధులకు నియమితులైన హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ల వారీగా ఉపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. 212 మంది చీఫ్ ఎగ్జామినర్లతో పాటు మరో 212 మందిని స్పెషల్ అసిస్టెంట్లు, 635 మందిని అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా నియమించామని తెలిపారు. ఆయా కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు విధుల్లో ఖచ్చితంగా పాల్గొనాలని, ఏ ఒక్కరికీ మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. మూల్యాంకనంలో భాగంగా ఒక్కో ఎగ్జామినర్ రోజుకు 40 జవాబు పత్రాలను వాల్యుయేషన్ చేయాల్సి ఉండగా, జిల్లాకు ప్రభుత్వం నుంచి 2.12 లక్షల స్క్రిప్టులు వచ్చాయని చెప్పారు. ఈనెల 19న స్పాట్ వాల్యుయేషన్ జరిగే రోజు నుంచి ప్రతి రోజూ ఉదయం 8 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 9 గంటలకు స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం లోపలికి విధుల్లో నియమించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు మినహా ఇతరులెవ్వరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆర్డర్లు పొందిన వారిని విధుల నుంచి రిలీవ్ చేసి స్పాట్ వాల్యుయేషన్‌కు పంపాలని, రిలీవ్ చేయని హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై ఉప విద్యాశాఖాధికారులతో పాటు ఎంఈఓలు, హెచ్‌ఎంలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు షబ్-ఎ-ఖదర్

అల్లాహ్ అనుగ్రహం కోసం రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు



నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

లక్ష్మీపురం: ఇస్లామిక్ క్యాలెండర్ నెల రంజాన్ పవిత్ర రాత్రులలో షబ్-ఎ-ఖదర్ ఒకటి. ఈ రాత్రులలో దేవుడిని ఆరాధించడం ద్వారా తమ ప్రతి న్యాయమైన కోరిక నెరవేరుతుందని ముస్లింలు నమ్ముతారు. రంజాన్ మాసంలోని చివరి పది రోజులలో 5 రాత్రులు కూడా చాలా ప్రాధాన్యత కలిగినవి అని చెబుతారు.

షబ్-ఎ-ఖదర్ ఎప్పుడు జరుపుకొంటారు?

ఇస్లామిక్ క్యాలెండర్ తొమ్మిదో నెల అయిన రంజాన్ మాసం చివరి ఐదు రాత్రులలో షబ్-ఎ-ఖదర్ జరుపుకొంటారు. వేల రాత్రుల ప్రార్థనల కంటే ఈ 5 రాత్రుల ప్రార్థనలు పుణ్యఫలం ఎక్కువగా ఉంటుందని ఒక నమ్మకం. దీని కారణంగా ముస్లిం సమాజం షబ్-ఎ-ఖదర్ సమయంలో అల్లాహ్‌ని ఆరాధిస్తారు. ఈ రోజు రాత్రి తరువాత నుంచి మూడు రోజుల పాటు రంజాన్ ఉపవాస దీక్షలను కొనసాగిస్తారు. రంజాన్ 27వ రోజు నిర్వహించే షబ్-ఎ-ఖదర్ రోజున ఖురాన్ పఠనం పూర్తి అయిన సందర్భంగా తరావీహ్ ప్రత్యేక నమాజ్‌లు చేసిన హఫీజ్‌లను గౌరవిస్తారు. రాత్రంతా ప్రార్థన చేసిన తరువాత ముస్లింలు తమ బంధువులు, స్నేహితుల కోసం ఉదయాన్నే ఫాతిహా పఠిస్తారు. వారి మగ్ఫిరత్(మోక్షం) కోసం ప్రార్థిస్తారు.

ఈ రాత్రి ప్రాధాన్యత ....

ఈ రాత్రి అల్లాహ్‌ను ఆరాధించే విశ్వాసి స్థితి ఉన్నతమైనది. వారి పాపాలు క్షమించబడతాయి. నరకాగ్ని నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ మార్గం ద్వారా రంజాన్ మాసం అంతా దీవెనెలు, ఆశీర్వాదాలు కురుస్తాయి. రంజాన్ మాసంలో ఒక మంచి పనికి బదులుగా అల్లాహ్ 70 మంచి పనులు జోడిస్తారు. ఈ రాత్రి అన్ని ఆరాధనలు, ఖురాన్ పఠనం, ప్రత్యేక నమాజ్‌లు, ప్రార్థనలు అంగీకరించబడతాయని నమ్ముతారు.

విద్యుత్ దీపాలతో మసీదులు ముస్తాబు

రంజాన్ మాసంలోని షబ్-ఎ-ఖదర్ రోజు రాత్రి పెద్ద జాగారం చేసుకునేందుకు అన్ని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేస్తారు. ఈ మాసంలో ప్రతి ఒక్క ముస్లిం తన ఆర్థిక స్తోమతను దృష్టిలో పెట్టుకుని తోటివారికి తగిన విధంగా అన్నదానం, ఇఫ్తార్ విందులు, బట్టలు, నగదు దానం చేసి అల్లాహ్ అనుగ్రహం కోసం తమదైన శైలిలో సేవలు చేస్తారు.

ముగ్గురు మైనర్ల అదృశ్యం

చీరాల: మండలంలో ఒకే రోజు ముగ్గురు మైనర్లు అదృశ్యమయ్యారు. రూరల్ ఎస్ఐ జనార్దన్ తెలిపిన వివరాల మేరకు.. వాడరేవుకు చెందిన ఇద్దరు బాలికలు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో కేసులో కావూరి వారిపాలేనికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని శనివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పడుకుంది. ఆదివారం ఉదయానికి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసులు నమో దు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ జనార్దన్ తెలిపారు.

ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మార్చి 2న వాక్ ఇన్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు రూపొందించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు సోమవారం తెలిపారు. లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలన్నారు. మెరిట్ లిస్టును guntur.ap.gov.in సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

అనాథ బాలలకు 'మిషన్ వాత్సల్య'


మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

బాపట్ల: అనాథ బాలల కోసం ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పాఠశాల విద్యనభ్యసిస్తూ తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకం ఉపయోగమని చెప్పారు. పిల్లలకు నెలకు రూ.4వేలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందాని పేర్కొన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శైలజ పాల్గొన్నారు.

త్రీడీ టెక్నాలజీకి ప్రాధాన్యం


మాట్లాడుతున్న ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో త్రీడీ టెక్నాలజీకి ప్రాధాన్యం పెరిగిందని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం 3డి ప్రింటింగ్ ఐ ఓ టీ టెక్నాలజీస్‌పై నిర్వహించనున్న ఐదు రోజుల వర్క్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. వర్క్ సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్ మాట్లాడుతూ ఈ త్రీడీ ప్రింటింగ్ ఐఐటీ చెన్నై వాళ్లు మొదటిగా మన దేశంలో ప్రారంభించారు. ఇది ఇప్పుడు ఉన్న టెక్నాలజీల్లో నూతనమైనదని తెలిపారు. వర్క్‌షాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.కె.సి.గణేష్ ఫౌండర్ ఆఫ్ 3డీ ప్రింటింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గెల్లి దిలీప్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ డి. రామ్మోహన్‌రావు, జాయింట్ సెక్రెటరీ కె.హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ టి.రామకృష్ణ, సివిల్ ఇంజినీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సురేష్, పి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

వంతెన పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



అద్దంకి: గుండ్లకమ్మ వంతెనపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. అద్దంకి పట్టణంలోని నంబూరిపాలెంలో నివసిస్తున్న ఒంటెద్దు వెంకయ్య(36)కు భార్య, ఏడుగురు సంతానం ఉన్నారు. కాటిపాపరి వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత రాత్రి ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో వెంకయ్య గుండ్లకమ్మ నది వంతెనపై నుంచి కిందకు దూకి మృతిచెందాడు. మృతదేహాన్ని ఎస్ఐ సమందర్‌వలి మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

ఇంటి నుంచి అత్తా, మామ గెంటేశారు

- ఎస్పీకి ఓ మహిళ ఫిర్యాదు
- స్పందనకు ఫిర్యాదుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అర్జీలు వెలువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు నేరుగా ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్‌లను కలిసి తమ సమస్యలు వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్ సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.


జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నా కొడుకు మృతిపై అనుమానం

చీరాల మండలం, థామస్‌పేటకు చెందిన నాకు 16 సంవత్సరాల వయసు కలిగిన రెహ్మాన్ ఉన్నారు. ఈనెల 12న ఇద్దరు ఆడపిల్లలు, నా కుమారుడుతో కలసి నలుగురు మగపిల్లలు రామాపురం బీచ్‌కు వెళ్లారు. వీరిలో నా కుమారుడుతో పాటు మరో వ్యక్తి చనిపోయాడు. అప్పటి నుంచి వాళ్లు ఎవరూ ఆచూకీ లభించడం లేదు. అసలు నా కుమారుడు సముద్రంలో మునిగి చనిపోయాడా... లేక ఎవరైనా చంపి సముద్రంలో పడేశారా అనే అనుమానాలు ఉన్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి.

– షేక్ హసినా, థామస్‌పేట

నా కుటుంబానికి న్యాయం చేయాలి

చెరుకుపల్లి మండలం, తుమ్మలపాలెం గ్రామానికి చెందిన నాకు కర్లపాలెం మండలం, పాతనందాయపాలెం గ్రామానికి చెందిన రావి సుబ్బారెడ్డితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. మాకు ఇద్దరు పిల్లలు. నా భర్త కరోనా కారణంగా రెండేళ్ల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి మా మామ శ్రీనివాసరెడ్డి, అత్త పద్మ నన్ను నా ఇద్దరు పిల్లల్ని ఇంటి నుంచి గెంటేశారు. నాకు న్యాయం చేయండి.

– రావి ఉర్లమ్మ, పాతనందాయపాలెం

పొలంలోకి వస్తే చంపుతామంటున్నారు

పిట్టలవానిపాలెం మండలం, చందోలు గ్రామానికి చెందిన మాకు సర్వే నంబర్ 321, 322, 323, 324, 325లో 14 ఎకరాల ఉమ్మడి ఆస్తి ఉంది. దాంట్లో నా వాటాగా 4.32 వస్తుంది. నాకు కోర్టు ఆర్డర్ కూడా ఇచ్చింది. మా గ్రామానికి చెందిన యినాయత్ బాషా, ఫసాయిర్ బాషా, ఫజురుల్ రెహ్మాన్, కత్తి సలోమాన్‌లు దానిని ఆక్రమించుకొని నన్ను చంపేందుకు ప్రయత్నిస్తున్నారు. నేను వృద్ధాప్యంలో ఉన్నాను. వారి చెర నుంచి నన్ను, నా ఆస్తిని కాపాడండి.

– షేక్ నశీమున్నీసా, వృద్ధురాలు

చీరాల 2 టౌన్ ఎస్ఐ చితకబాదారు

నన్ను సివిల్ కంప్లంట్ విషయంలో స్టేషన్‌కు ఈనెల 12న పిలిపించారు. ఈ విషయానికి సంబంధించి కోర్టులో పెండింగ్ ఉందని చెప్పాను. అయినా చితకబాదారు. ఇదేం న్యాయమంటూ ప్రశ్నించిన నా కుమారుడు కోటేశ్వరరావును ఇష్టమొచ్చికొట్టి, తీవ్రంగా దుర్భాషలాడారు. న్యాయం చేయాలి.

–రెబ్బవరపు సుబ్బారావు, రామ్‌నగర్

మరిది వలన ప్రాణహాని

పాతచీరాలలో నాకు సర్వే నంబర్ 798 ఖాతా నంబర్ 484లో 75 సెంట్ల ఆస్తి ఉంది. దానిని లాక్కొనేందుకు మా మరిది కోటయ్య, ఆయన కుమారుడు బాలకృష్ణ ప్రతిరోజు నన్ను తీవ్ర ఇబ్బంది పెడుతున్నారు. ఎప్పుడు చంపుతారోనని భయంగా ఉంది.

– దేవరకొండ పార్వతి, పాత చీరాల

దండా ప్రసాద్ సేవలు నిరుపమానం

ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న లంకా రఘురామిరెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): ప్రజాభిమానం చూరగొంటూ సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపిన పారిశ్రామికవేత్త దండా ప్రసాద్ ఆకస్మిక మరణం వేలాది మంది ప్రజల పాలిట పిడుగుపాటైందని ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి చెప్పారు. లక్ష్మీపురంలోని అసోసియేషన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలు నిర్వహిస్తున్నా ఆర్థిక బలం సమృద్ధిగా ఉన్నా మూలాలు మరువని ఉన్నత వ్యక్తి ప్రసాద్ అని కొనియాడారు. వ్యాపార రంగంలో సంపాదించిన దానిలో కొంత భాగం పేద ప్రజల కోసం వినియోగించాలని, అందులోనూ విద్యాభివృద్ధికి తనవంతు జీవితాన్ని అంకితం చేయాలని భావించిన విలక్షణ వ్యక్తిత్వం ప్రసాద్‌ది అని పేర్కొన్నారు. ప్రసాద్ తండ్రి బ్రహ్మానందం మాట్లాడుతూ మంగళవారం నాదెండ్ల మండలం, గిరిజవోలు గ్రామంలోని జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్‌లో ఆవరణలో ప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సామినేని కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన


సిబ్బందికి మెటీరియల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తున్న జిల్లా వ్యసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు రూరల్: రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆదేశించారు. నగరంలోని కృషి భవన్‌లో 2023–24 ప్రకృతి వ్యవసాయం కార్యాచరణ ప్రణాళికపై సిబ్బందికి సోమవారం శిక్షణా నిర్వహించారు.ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ మంగళవారం నుంచి జిల్లాలోని 16 మండలాల్లోని 87 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 80 గ్రామాలలోని రైతులు, మహిళా సంఘాల సమన్వయం(వెలుగు)తో ఖరీఫ్‌లో వేసే పంటలు, ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరం అయ్యే వనరులపై ప్రణాళిక సిద్ధం చేయనున్నట్టు వెల్లడించారు. అనంతరం జిల్లా ప్రకతి వ్యవసాయ సిబ్బందికి ప్రణాళికల ఫార్మాట్స్, మెటీరియల్స్‌ను జేడీఏ అందజేశారు. వెలుగు ప్రాజెక్టు అధికారి మురళీధర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలకు అవసరమైన రుణాలు మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం జానకమ్మ, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య లక్ష్యాల సాధనకు కృషి


మాట్లాడుతున్న గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: విద్య, వైద్య శాఖల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు మండల స్థాయి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రూ.వేల కోట్లు విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తోందన్నారు. విద్య, వైద్య ప్రయోజనాలు ప్రజలందరికీ చేరాలంటే ఉద్యోగులు, అధికారుల పాత్ర కీలకమన్నారు. డ్రాపవుట్లపై దృష్టిపెట్టాలని, పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీట్ల కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకూడదని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రణాళికలు పాటించాలన్నారు. బాలింతలు, గర్భిణులు, రక్తహీనత ఉన్న మహిళలు, చిన్నారులకు నిరంతరం పరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం అందించాలని చెప్పారు. సమావేశంలో డీఈఓ శైలజ, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రావణ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయం

కారెంపూడి: బ్యాంకు ఖాతా నుంచి రూ.45,693 మాయం అయిన ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితుడు స్థానిక ఎస్‌బీఐ శాఖ చీఫ్ మేనేజర్ కె.ఏడుకొండలుకు సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. విద్యుత్ శాఖ స్థానిక సెక్షన్ ఆఫీస్ పరిధిలోని చింతపల్లి గ్రామ అసిస్టెంట్ లైన్‌మెన్‌గా కె.కామేశ్వరరావు పనిచేస్తున్నాడు. ఖాతాలో ఏప్రిల్ నెలలో జమ అయిన జీతంలో ఐదు దఫాలుగా మొత్తం రూ.45,693 మాయం అయ్యాయని వివరించాడు. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన ఫోన్ నంబరుకు కూడా సమాచారం రాలేదని, డబ్బు డ్రా చేసుకుందామని బ్యాంక్‌కు వచ్చినప్పుడు నగదు మాయం విషయం తెల్సిందన్నారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఈ విషయాన్ని పై అధికారులకు నివేదించారు. ఎఫ్1 టీఎక్స్ఎన్ సీఎస్‌పీ ఎఈపీఎస్‌ను ట్రాప్ చేయడంతో పాటు ఖాతాదారుని ఫోన్ నంబరును కూడా ట్రాప్ చేసి నగదును 4899472105213, 489948 9105214, 4899505105218 నంబర్లకు నగదును సైబర్ నేరగాళ్లు మళ్లించారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే స్థానిక ఎస్‌బీఐతో పాటు, యూనియన్ బ్యాంక్ ఖాతాదారుల ఖాతాల నుంచి ఇలా నగదు మాయం అవుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికి కారెంపూడి మండలానికి చెందిన 16 మంది బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం అయినట్లు సమాచారం. వారి ఫిర్యాదులను బ్యాంకు మేనేజర్లు స్వీకరించి పై అధికారులకు పంపుతున్నారు. దీనికి తక్షణ నివారణోపాయంగా తమ సెల్‌ఫోన్‌లో ఆధార్ నంబరును లాక్ చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఏడుకొండలు ఖాతాదారులను సూచిస్తున్నారు. ఆధార్ నంబరును వినియోగించే సమయంలో బయోమెట్రిక్ వేసే సందర్భాలలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అక్రమ మద్యం కలిగిఉన్న కంచేటి సాయి అరెస్ట్

క్రోసూరు: తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా కంచేటి సాయిబాబు వాహనంలో 20 బాటిళ్ల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, సాయిబాబును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ సోమవారం తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న కరణం వెంకటేష్

చీరాల టౌన్: పొలంలో మొక్కలకు నీరు పెడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం మండలంలోని కావూరివారిపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపన వివరాల మేరకు.. కావూరివారిపాలెంకు చెందిన ఎ.శ్రీనివాసరెడ్డి (35) పొలంలో నీరు పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లపై కాలు వేయడంతో షాక్ గురై కుప్పకూలాడు. గమనించిన తోటి రైతులు చికిత్స కోసం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, మాజీ మంత్రి పాలేటి రామారావులు ఏరియా వైద్యశాలలో శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

కృష్ణానదిలో పడి యువకుడి మృతి

కొల్లూరు: కృష్ణా నదిలో పడి మతిస్థిమితం లేని ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గాజుల్లంకకు చెందిన బావిరెడ్డి కోటేశ్వరరావు కుమారుడు రేణుకయ్య(18) మతిస్థిమితం లేని కారణంగా ఇంటికే పరిమితమయ్యాడు. ఆదివారం రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడు కనిపించకుండా పోవడంతో గ్రామంలో వెతికిన తల్లిదండ్రులు స్థానికుల సాయంతో కృష్ణా నది ప్రాంతంలో వెతుకుతుంటే సోమవారం సాయంత్రం నీటిలో మృతదేహాన్ని గుర్తించారు. వీఆర్ఓ జగదీష్, బాలుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజీవ్‌శామ్యూల్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని నీటి నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అండర్- 23 క్రికెట్ జట్టు ఎంపిక


అండర్-23, సీనియర్ క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ కార్యదర్శి, కోచ్‌లు

మేదరమెట్ల: బాలుర అండర్- 23 క్రికెట్ పోటీలకుగాను క్రీడాకారులను ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలోని రావినూతల ఆర్ఎస్‌సీఏ స్టేడియంలో సోమవారం ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి మొత్తం 35 మంది క్రీడాకారులు హాజరు కాగా వీరిలో 25 మంది ఎంపికయ్యారు. ఈనెల 19వ తేదీ ఎంపికైన క్రీడాకారులకు క్రికెట్ పోటీలు నిర్వహించి వీరిలో 16 మందితో జట్టును ఖరారు చేస్తారని అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన సీనియర్ క్రికెట్ జట్టు 21వ తేదీ కృష్ణా జిల్లా మూలపాడు క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల టీ- 20లో, అండర్- 23 క్రికెట్ జట్టు 26వ తేదీన జరిగే పోటీల్లో పాల్గొంటుందని కార్యదర్శి తెలిపారు. ఎంపికలో కోచ్‌లు కే సుధాకర్, పీ బాబూరావు, సంయుక్త కార్యదర్శి బీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్పాహార నిధులు జమ చేస్తాం

ఏపీటీఎఫ్ నేతల వినతిపై జెడ్పీ చైర్‌పర్సన్ హామీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థుల అల్పాహారానికి సంబంధించిన నిధులను విడుదల చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మొహ్మద్ ఖాలీద్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం జెడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్లో హెనీ క్రిస్టినాను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఆ మొత్తాన్ని సంబంధిత హెచ్ఎంల ఖాతాల్లో జమ చేసేందుకు కృషి చేస్తామని క్రిస్టినా హామీ ఇచ్చారు.